క్లుప్తంగా

నేడు దళిత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

కాశీబుగ్గ: పలాస రైల్వే ఇనిస్టిట్యూట్ వద్ద శ్రీకాకుళం జిల్లా దళిత సంఘాల సంయుక్త మండలి ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో నిరుపేద దళిత విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పన, గురుకులాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకం, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలో స్థానంలో కొత్తవి నిర్మాణం తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.

నేడు ఉర్స్ ముబారక్

సోంపేట: బెంకిలి గ్రామపంచాయతీలో హాజరత్ సయ్యద్ బద్రుద్దీన్ షా దర్గావద్ద ఆదివారం ఉర్స్ ముబారక్ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నమాజ్ ఖురాన్‌ఖానీ, బాబా చద్దర్ గంథకం ఊరేగింపు, విందు ఉంటుందన్నారు. హాజరత్ సయ్యద్ బద్రుద్దీన్‌షా బాబా భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోంపేట: మండలంలోని బుసాబద్ర పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మరమ్మతుల చేపట్టనున్నారు. దీంతో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పాత్రకొండ, మాకన్నపురం,ఎం.జీపురం, సుంకిడి, బుసాబద్ర పంచాయతీల పరిధిలోని గ్రామాలకు సరఫరాను నిలిపివేస్తమని వినియోగదారులు గమనించి సహకరించాలని పలాస విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు శనివారం కోరారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.యజ్ఞేశ్వరరావు తెలిపారు. చినబాడాం ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ పెంటిబద్ర, జయరామచంద్రపురం, పద్మనాభపుర, ఓల్డ్‌ఎన్‌హెచ్-5 రోడ్డు, తాళ్లభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, చినబడం, అంతరకుడ్డ, రాజపురం పరిసర ప్రాంతాలకు సరఫరా నిలిపి వేస్తామన్నారు.

మంచినీటి కుళాయిలు ప్రారంభం


కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: పలాస మండలం రామక్రిష్ణాపురం సమీపంలోని ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలలో ఇంటింటికీ మంచినీటి కుళాయి పథకాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం ప్రారంభించారు. రూ.3.16 కోట్లతో జలజీవన్ మిషన్ పథకంలో మంజూరైన నిధులతో కుళాయిలను ఏర్పాటు చేశారు. కార్యక్రమం ఏపీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీ సంఘ నాయకులు లొడగల కామేశ్వరరావు, పీరుకట్ల విఠల్‌రావు, నాయకులు కుత్తుం రూపావతి, సవర రాంబాబు, సప్ప నవీన్, దడియాల నరసింహులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాంక్ మేనేజర్‌కు తీవ్రగాయాలు


గాయపడిన శ్రీకాంత్ పాణిగ్రహీ

కాశీబుగ్గ: మందస మండలం కెనరా బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ పాణిగ్రహి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. గొప్పిలి గ్రామ సమీపంలో శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రోడ్డు పాడైన చోట అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పలాస 108 అంబులెన్స్ సిబ్బంది సత్యం, వెంకటరావులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన పాణిగ్రహికి ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఈయనిది ఒడిశా రాష్ట్రం కాగా.. మందస మండలంలో ఉద్యోగం చేస్తున్నారు.

ప్రజల సహకారంతోనే సారా నిర్మూలన సాధ్యం


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

పాతపట్నం: ప్రజల సహకారంతోనే సారా నిర్మూలన సాధ్యమవుతుందని పాతపట్నం ఎక్సైజ్ ఎస్ఐ బి.శ్రీనివాసరావు అన్నారు. నవోదయం-2.0లో భాగంగా మండలంలోని ప్రహరాజపాలెం గ్రామాల్లో సారా నిర్మూలనపై శనివారం అవగాహన కల్పించారు. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మహిళా పోలీసు ప్రసన్న, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రమాదాలను ఆహ్వానిస్తున్న మలుపులు!

- హైవేపై ప్రమాదకర ప్రయాణాలు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- దృష్టిసారించని అధికారులు


ప్రమాదకరంగా ఉన్న లచ్చనపేట గ్రామ సమీప జాతీయ రహదారి


ప్రమాదాలను ఆహ్వానిస్తున్న గూడేం గ్రామ సమీప రోడ్డు

టెక్కలి రూరల్: జిల్లా మీదుగా వెళ్తున్న 16వ నంబర్ జాతీయ రహదారితోపాటు రాష్ట్ర రోడ్లపై పలుచోట్ల ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నివారణ చర్యలపై దృష్టిసారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో చాలామంది ప్రాణాలు కోల్పోతుండగా.. మరికొందరు దివ్యాంగులుగా మారుతున్నారు. ముఖ్యంగా టెక్కలి మండలం పరిధిలోని గూడేం, సన్యాసినీలాపురం, లచ్చన్నపేట తదితర గ్రామాల సమీపంలో రహదారిపై ఉన్న మలుపులు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా లచ్చన్నపేట సమీపంలో ఉన్న మలుపు వద్ద అధిక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేదీన నందిగాం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న బెండి అభిరాం అనే యువకుడు లచ్చన్నపేట వద్ద ఉన్న మలుపులో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. అదేనెల 23వ తేదీన ఓ ట్రాక్టర్ డ్రైవర్ ఇదే మలుపు వద్ద అదుపుతప్పి పడిపోవడంతో మృతిచెందాడు. అలానే టెక్కలి నుంచి నందిగాం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పిట్ట రవి అనే యువకుడు లచ్చయ్యపేట మలుపువద్ద అతివేగంగా వచ్చిన కారును ఢీకొని ప్రాణాలు కోల్పోయాడు. ఈ మలుపు వద్ద తరచూ ఏదో ఒక ప్రమాదం చోటుచేసుకుంటూనే ఉంది. అలానే టెక్కలి-మెళియాపుట్టి రోడ్డులోని గూడేం గ్రామం వద్ద ఉన్న మలుపు సైతం ప్రమాదకరంగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక నిత్యం ప్రమాదాలు చోటచేసుకుంటున్నాయి. ఇటీవల ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు వెళ్తుండగా ఈ మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనం కపించక పోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మిగిలిన ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారిపై ఉన్న మలుపులు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. కేవలం ప్రమాదం జరిగిన తరువాత వివరాలు సేకరణతోనే సరిపెడుతున్నారని, నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


లచ్చన్నపేట మలుపు వద్ద చనిపోయిన పిట్ట రవి (ఫైల్)


లచ్చన్నపేట మలుపు వద్ద ధ్వంసమైన కారు (ఫైల్)

శ్మశానవాటిక అభివృద్ధికి అంగీకారం

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురంలోని ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం సమీపంలో ఉన్న వల్లభరాయుడి గెడ్డ శ్మశానవాటిక అభివృద్ధికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు అంగీకారం తెలియజేశారు. శ్మశానవాటికలో గ్యాస్ ఉపయోగించి మృతదేహాల దహన సంస్కారాలకు జరిపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు రోటరీక్లబ్ గతంలో మున్సిపల్ కౌన్సిల్ అంగీకారం కోరింది. ఈ విషయంపై మున్సిపల్ కౌన్సిల్ అంగీకారం తెలిపినప్పటికీ స్థానికుల నుంచి కొన్ని అభ్యంతరాలు రావడంతో శనివారం మరోసారి రోటరీహాల్‌లో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు సమావేశమై చర్చించారు. గ్యాస్ ఉపయోగించి దహన సంస్కారాలకు జరిపించడం వల్ల తక్కువ ఖర్చవుతోందని అందరూ అంగీకరించారు. నిధులు అవసరమైతే ఇచ్చేందుకు కొంతమంది నాయకులు హామీ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, నాయకులు ఉలాల బాలయ్య, కె.ధర్మారావు, దిల్లీప్, పాక దాసు, లీలారాణి, సూర్యం, జానీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

మత్స్యకార కుటుంబానికి రూ. 2.30 లక్షల ఆర్థిక సాయం


భానుమతికి సాయాన్ని అందజేస్తున్న సంఘ సభ్యులు

సోంపేట: మండలంలోని ఇస్కలపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు శీరాపు శ్యామ్‌సుందర్ ఇటీవల బోటు ప్రమాదంలో చెన్నైలో మృతి చెందాడు. ఇంటిపెద్ద మృతితో కుటుంబం జీవనాధారం కోల్పోయింది. దీంతో చెన్నైకి చెందిన పోలమాంబ సంఘం సభ్యులు, ఇస్కలపాలెం గ్రామ పెద్దలు రూ. 2,30,000 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని శ్యామ్ సుందర్ భార్య భానుమతికి శనివారం అందజేసి అండగా నిలిచారు.

ఘనంగా తిరువీధి ఉత్సవం



శేషవాహనంపై వేంకటేశ్వర స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

నరసన్నపేట: వేంకటేశ్వర స్వామి వారిని శనివారం అశ్వ వాహనంపై నరసన్నపేట పురవీధుల్లో ఊరేగారు. స్థానిక వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి మూడో రోజు ఈ విధంగా ఊరేగారు. ఆలయ ట్రస్టీ సభ్యులు పి.కృష్ణప్రసాద్‌తోపాటు ఆలయ అర్చకుడు సాయి కృష్ణమాచార్యులు, సత్యవరాగ్రహారానికి చెందిన పండితుడు మావుడూరి జగదీష్ బాబు, తదితరులు పాల్గొన్నారు. వీధుల్లో భక్తులు దారి పొడవునా స్వామివారికి నీరాజనాలు పలికారు. ర్యాలీలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..


ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న తీగలు


అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే మార్గంలో ఇలా..


విద్యుత్ స్తంభాన్ని చుట్టేసిన తీగలు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 12వవార్డు పరిధిలోని హరిజనవీధి పరిసరాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలకు, వైర్లకు పిచ్చిమొక్కల తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. ఇదేమార్గంలో అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నపిల్లలు వచ్చి వెళ్తుంటారు. మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు స్పందించి అల్లుకున్న తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

–కాశీబుగ్గ

నిరుపయోగంగా బస్టాండ్!


నిరుపయోగంగా ఉన్న బస్టాండ్


కవిటిలో మెయిన్‌రోడ్డుపై నిలిపిన ఆర్టీసీ బస్

- రోడ్డుపైనే బస్సులను నిలిపివేస్తున్న వైనం
- నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లు
- ట్రాఫిక్‌తో ప్రజలకు అవస్థలు

కవిటి: మండల కేంద్రమైన కవిటిలో రోజురోజుకూ ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేటు వాహనాలు, ఆటోలు సైతం నడిరోడ్డుపైనే నిలిపి వేయడమే. ఆర్టీసీ సంస్థ ఏర్పాటైన తొలినాళ్లలో కవిటిలో బస్టాండ్ ఏర్పాటు చేసేందుకు అప్పటి గ్రామ పంచాయతీకి చెందిన స్థలాన్ని పాలకవర్గం రోడ్డు రవాణా సంస్థకు విక్రయించింది. ఈ స్థలంలో బస్టాండ్‌ను నిర్మించారు. అయితే ఆర్టీసీకి చెందిన స్థలం ఇప్పుడు ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకుంది. ఫలితంగా రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. దీంతో కవిటి మెయిన్‌సెంటర్లో రోడ్డుపైనే బస్సులను ఇష్టారాజ్యంగా నిలిపేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీనిపై అటు ఆర్టీసీ అధికారులు గానీ, ఇటు పోలీసులు గానీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

వెంటాడుతున్న ట్రాఫిక్ కష్టాలు

వాస్తవానికి కవిటి-సోంపేట-ఈదుపురం ప్రధాన రోడ్డు మార్గం పొడవునా కవిటి పట్టణ పరిధిలో నిత్యం ట్రాఫిక్ అంతరాయాలు ప్రజలకు సర్వసాధారణం అయిపోయాయి. కవిటి పట్టణంలో అన్ని అంతర్గత రూట్లలో ఆటో డ్రైవర్లు తమకు కేటాయించిన స్థలం అన్నట్టుగా ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలిపివేస్తున్నారు. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ముందుగా ఆర్టీసీ బస్టాండ్ పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో బస్సులు ఆపి ప్రయాణికులు రాకపోకలు చేస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఇక అశోక్ థియేటర్ నుంచి మహలక్ష్మి థియేటర్, బస్టాండ్, అంబేడ్కర్ విగ్రహం సెంటర్, హనుమాన్ గుడి సెంటర్, చింతామణి గుడి రోడ్డులో ఇష్టారాజ్యంగా ఆపేస్తున్న ఆటోలపై పోలీసు యంత్రాంగం దృష్టిసారిస్తే ట్రాఫిక్ కష్టాలను అధిగమించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

బస్టాండ్‌ను వినియోగించాలి



కవిటి మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆర్టీసీ బస్ స్టాండ్‌ను సంబంధితశాఖ అధికారులు వినియోగంలోకి తీసుకురావాలి. బస్సులను అక్కడే ఆపేవిధంగా చర్యలు చేపట్టాలి. ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో పోలీసులు కొద్దిగా దృష్టిపెడితే కవిటిలో ట్రాఫిక్ సమస్యల్ని అధిగమించవచ్చు.

– పాండవ చంద్రశేఖర్, మండల కోఆప్షన్ సభ్యుడు, కవిటి

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి. ఎక్కడపడితే అక్కడ నిలిపి వేస్తుండడంతో ట్రాఫిక సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ సమస్య పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఆ దిశగా కృషి చేయాలి.

–తెలుకల ప్రేమానంద్‌సాహూ,కవిటి

విశ్వశాంతి మహాయజ్ఞం



ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని ఒకటో వార్డు పురుషోత్తపురం విశ్వశాంతి ఏకకుండీ మహాయజ్ఞం వైభవంగా జరుగుతోంది. శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైందవ ధర్మపరిరక్షణలో ఇటువంటి యజ్ఞయాగాదులే మూలస్తంభాలుగా నిలుస్తాయన్నారు. మహాయజ్ఞానికి తనవంతుగా రూ. 10 వేలు విరాళంగా ఎమ్మెల్సీ అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, నర్తు నరేంద్రయాదవ్, ప్రేమ్‌కుమార్, చాట్ల పుష్ప, చాట్ల తిరుపతి, మామయ్య ఉన్నారు. – ఇచ్ఛాపురం

నవధాన్యాల సాగుపై అవగాహన



సేంద్రియ పద్ధతిలో నవధాన్యాలు సాగుచేయడం వలన రైతుకు ఎన్నో ప్రయోజనాలున్నాయని కంచిలి మండల యాంకర్ టి.శివానందం అన్నారు. కేసరపడ, అంపురం గ్రామాల్లో నవధాన్యాల కిట్ల తయారీపై రైతులకు శనివారం అవగాహన కల్పించి వీటి ఉపయోగాన్ని వివరించారు. నవధాన్యాల సాగుతో మొక్కకు కావల్సిన 50 రకాల పోషకాలు ఉన్నాయన్నారు. కార్యక్రమాల్లో స్థానిక నేత కప్ప యుగంధర్, మాస్టర్ ట్రైనర్ దుర్గాప్రసాద్, ఐసీఆర్‌పీలు శీర కామరాజు, రోహిణి, పుష్పలత, భవానీ, మీనా ఉన్నారు. –కంచిలి

అలరించిన సంగీత గాత్రకచేరీ



కవిటిలోని పట్టాభిరామాలయం 79వ తిరుకల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించిన సంగీత గాత్ర కచేరీ సంగీత ప్రియులను అలరించింది. విజయవాడకు చెందిన మల్లాది శివానంద్ యశస్వి గాత్రానికి సింధురాగేశ్వరి వయోలిన్‌తో, తిరుపతికి చెందిన టీవీ కృష్ణవంశీ మృదంగంతో వాయిద్య సహకారం అందించారు. కళాకారులకు ఆలయ అనువంశిక ధర్మకర్తలు బెందాళం కామరాజు, నారాయణమూర్తి సోదరులు దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. –కవిటి

సైనికా నీకు వందనం..


టెక్కలి: పూజలు చేస్తున్న బీజేపీ కార్యకర్తలు


ఇచ్ఛాపురం టౌన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



కాశీబుగ్గ: జవాన్లకు మద్దతు తెలియజేస్తున్న బీజేపీ నాయకులు


కాశీబుగ్గ: శాంతిహోమం చేస్తున్న దృశ్యం


ఇచ్ఛాపురం రూరల్: సంఘీభావ ర్యాలీ చేస్తున్న దృశ్యం

టెక్కలి: దేశం కోసం తలపెట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ టెక్కలిలోని వైభవ వేంకటేశ్వర ఆలయంలో బీజేపీ కార్యకర్తలు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను కొల్లగొట్టిన సైన్యానికి అభినందనలు తెలియజేశారు. ఆపరేషన్ సిందూర్ మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జె.రామ్‌జీ, ఎస్.లక్ష్మీనారాయణ, బి.నరేంద్రచక్రవర్తి, డి.రాజ్‌కుమార్, నాగరత్నం, రమేష్, నాగేంద్ర, రామ్మోహన్, ప్రకాశ్, రమణ పాల్గొన్నారు.

దేశరక్షణ కోసం చర్చిలో ప్రార్థనలు

ఇచ్ఛాపురం టౌన్: భారత్, పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో దేశరక్షణ, శాంతి కోసం క్రిస్టియన్లు స్థానిక ఆంధ్రా బాపిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేశభద్రత కోసం సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులకు దేవుడు రక్షణ కలిగించాలని సంఘ విశ్వాసులు, పెద్దలు, మహిళలు ఉపవాసంతో ప్రార్థనలు చేశారు. యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాస్టర్ జాన్సన్, చర్చి అధ్యక్షులు ప్రత్తి విజయ్‌కుమార్, కార్యదర్శి తాతాజిబాబు, ట్రెజరర్ వజ్రపు వెంకటేష్, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధక్షుడు ప్రత్తి అన్వేష్ , జోష్ కుమార్, వీరకుమార్ పాల్గొన్నారు.

జవాన్ల కోసం శాంతిహోమం

కాశీబుగ్గ: దేశం కోసం యుద్ధం చేస్తున్న జవాన్లు క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పాతజాతీయ రహదారిలో ఉన్న బంకేశ్వరి మాతా ఆలయంలో బీజేపీ నాయకులు శాంతి హోమం చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి బదులు తీర్చుకునేందుకు పాకిస్తాన్‌పై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు చేపట్టి ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని అన్నారు. వీరోచితంగా పోరాడుతున్న జవాన్లు సురక్షితంగా ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ కన్వీనర్ రామానంద స్వామి, జిల్లా కార్యదర్శి పాలవలస వైకుంఠరావు, అర్బన్ మండల అధ్యక్షులు పొట్నూరు తారకేశ్వరరావు, నర్తు రామారావు, గొంటి అప్పారావు, మామిడి వెంకటరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సైన్యానికి సంఘీభావంగా..

ఇచ్ఛాపురం రూరల్: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొంటున్న సైన్యానికి సంఘీభావంగా ఈదుపురంలో ర్యాలీ నిర్వహించారు. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకున్న నేపథ్యంలో సర్పంచ్ నర్తు ప్రసాద్ ఆధ్వర్యంలో బస్టాండు కూడలి వద్ద ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో హంగర్ బెహరా, యువత, ప్రజలు పాల్గొన్నారు.